క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి పౌర్ణమి పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మద్దికెర: పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతి అనంతరం నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. భక్తులకు ప్రసాదం, అన్నదానం చేశారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న నాయకులు

దేవనకొండ: మండలంలోని అలారుదిన్నె పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకుడు డి.మల్లయ్య, కురువ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బి.రామారావునాయుడు చేతుల మీదుగా శనివారం బ్యాగులు, పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, నరసింహులు, కుమార్, రాఘవేంద్ర, రామచంద్ర, నాగరాజ్, వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



పూజలందుకున్న గాయత్రీదేవి, మారెమ్మవ్వ

ఆస్పరి: మండలంలోని ఆస్పరి, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, చిన్నహోతూరు గ్రామాల్లో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులు వృషభాలను అలంకరించి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి, గాయత్రీదేవి, మారెమ్మవ్వ, సిద్ధరామేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పంటలు బాగా పండి గ్రామాలు సుభిక్షంగా ఉండాలని భక్తులు స్వామిఅమ్మవార్లకు మొక్కుకున్నారు.

కృష్ణగిరి ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


ఖాజావలి

కృష్ణగిరి: మండల ఎస్‌ఐగా ఖాజావలి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా కర్నూలు ఫ్యాక్షన్ జోన్ సీఐ జయన్న బాధ్యతలు చేపట్టారు. తాజాగా కర్నూలు స్పెషల్ బ్రాంచీలో ఉన్న ఖాజావలిని ఎస్‌ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పత్తికొండ రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది శనివారం మండల పరిధిలోని చక్రాళ్ల, చందోలి గ్రామాల్లో అవగాహన కల్పించారు. వర్షాలు కురుస్తుండడంతో ఇళ్ల చుట్టుపక్కల నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే వెంట ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్య కార్యకర్త మటం హేమవతి, ఏఎన్‌ఎం లలిత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గోధుమరి ఎల్లమ్మ తిరునాల


గోదాదేవి, లక్ష్మీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలో గోధుమరి ఎల్లమ్మ తిరునాల శనివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మగుండం రహదారిలోని దేవాలయంలో కొలువైన గోదాదేవి, లక్ష్మీదేవి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఏటా ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సాగు సాయం అందేనా?

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే పెట్టుబడి సాయంగా రైతు భరోసా నగదు క్రమం తప్పకుండా అందగా..కొత్త ప్రభుత్వంలో ఇంత వరకు ఆ దిశగా అడుగులు పడలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ పథకం నుంచి తొలి విడత సాయం రూ.2 వేలు చొప్పున రైతు ఖాతాల్లో పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా నగదు ఊసే లేదు. దీంతో రైతులు అప్పులు చేసి సాగు చేయాల్సిన పరిస్థితిల్లో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

- గత ప్రభుత్వంలో 62,217 మంది రైతులకు రూ.379.41 కోట్లు అందజేత
- పెట్టుబడి సాయం ప్రకటించని కొత్త ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ప్రస్తుత ఖరీఫ్‌కు పీఎం కిసాన్ నగదు మాత్రమే జమ
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా ఒకేసారి జమ
- నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 82,134 వేల హెక్టార్లలో సాగు


హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామ పొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

ఆలూరు రూరల్: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. శుక్ర, శనివారాల్లో ఏరువాక పౌర్ణమి కావడంతో రైతన్నలు తమ పశువులకు, వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేసి పనులు మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద తొలి విడత సాయంగా రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున జమ చేసింది. సాగుకు సిద్ధమవుతున్న రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలుకు ఈ మొత్తం కాస్త సహాయపడుతుంది. ఆలూరు నియోజకవర్గంలో 62,217 మంది రైతులకు రూ.124.434 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ మొత్తం కేంద్ర వాటా కాగా.. రాష్ట్ర ప్రభుత్వం చేసే సహాయం కోసం రైతాంగం ఎదరుచూస్తోంది.

నాడు ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం

సాగు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్) అందిస్తూ వారికి అండగా నిలిచారు. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభంలో, కొతల సమయంలో, రబీ ఆరంభంలో లేదా ధాన్యం ఇంటికి చేరే సమయానికి మూడు విడతలుగా అందించే వారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద గత ఐదేళ్లలో ఆలూరు నియోజకవర్గంలో 62,217 మంది రైతులకు రూ.379.41 కోట్లు అందించారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించగా.. ఎలాంటి భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ బోర్డు భూములు కౌలు కింద సాగు చేసే రైతులకు రైతు భరోసా సాయం కింద పెట్టుబడి సాయాన్ని అందించేది.

రాష్ట్ర సాయం కోసం ఎదరుచూపులు

ఖరీఫ్ పనులు ప్రారంభం కావడంతో విత్తనాలు, పొలం పనులకు డబ్బులు అవసరం అవుతున్నాయి. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా ఒకేసారి అందడంతో పెట్టుబడి కింద ఆ మొత్తం ఉపయోగపడేది. ఇప్పుడు రూ.2 వేలు మాత్రమే అందడంతో అది ఏం సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. కానీ రైతు పెట్టుబడి సాయంపై సంతకం చేయలేదు. ప్రకటన లేదు. వ్యవసాయం దండగా అన్న ప్రభుత్వం తమకు ఏం చేస్తుందో అని రైతులు సాయం కోసం నిరీక్షిస్తున్నారు.

అప్పులతో ప్రారంభం

నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 82,134 హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. ఈ ఏడాది ఖరీఫ్ రైతన్నలకు అప్పులతో ప్రారంభమవుతోంది.


ఆలూరు మండలం అరికెరలో పొలం దున్నుతున్న రైతు

రైతు పంట పండించేందుకు ఎకరాకు కనీసం రూ.12 నుంచి 15వేలు అవసరం. భూమిని సిద్ధం చేయడానికి ట్రాక్టర్ దుక్కులు, విత్తనాలు, కూలీలకు, పంట సాగుకు, మందులు అవసరమవుతాయి. పత్తి విత్తనాలకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు నగదుతో నడుస్తోంది. గతంలో ప్రభుత్వం కొంత సొమ్ము జమచేస్తే మిగిలిన సొమ్మును రైతు సరిచేసుకుని సాగు చేసేవారు. నేడు రైతు పెట్టుబడులకు చేతిలో సొమ్ములేక అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

అగ్రహార ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

హొళగుంద: మండల కేంద్రం హొళగుందతో పాటు లింగంపల్లి గ్రామంలో శనివారం స్వామివారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హొళగుంద సమీపంలోని అగ్రహార ఆంజనేయస్వామికి భక్తులు కాలినడకన చేరుకుని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే లింగంపల్లి గ్రామ దేవుడిగా పూజలందుకుంటున్న ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజ చేశారు.

27న పంచాయతీ వేలం పాటలు

హొళగుంద: ఈ నెల 27వ తేదీ హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన వేలం పాటలు సర్పంచ్ మాల రంగమ్మ, డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. వారపు సంత, బస్టాండ్, కమేళా నిర్వహణకు 9 నెలల కాలానికి వేలం పాట జరుగుతుందన్నారు. సాల్వెన్సు(సొంత ఆస్తులు) ఉన్న వారు బస్టాండ్, వారపు సంత మార్కెట్‌కు రూ.లక్ష, కమేళాకు రూ.10 వేలు, సాల్వెన్సు లేనివారు అదనంగా డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. డిపాజిట్‌ను నగదు రూపంలో ఇవ్వాలని పేర్కొన్నారు. సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్ నిర్వహణను పంచాయతీ చూసుకుంటుందని తెలిపారు.

శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

కృష్ణగిరి: గ్రామాల్లో పంతాలు పట్టింపులకు పోయి శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో శనివారం రాత్రి ఎస్‌ఐ ఖాజావలితో కలిసి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల సమయంలో బైండోవర్ చేసిన వారు మరలా తప్పు చేస్తే షూ్యరిటీ ప్రకారం జరిమానా విధిస్తామన్నారు. గ్రామంలో అందరూ ఐకమత్యంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఏరువాక.. సాగాలిక


అలంకరించిన ఎద్దులతో రామాపురం రైతు

తుగ్గలి: మండలంలోని రామాపురం, ముక్కెల్లలో శనివారం ఏరువాక పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే రైతులు తమ ఎద్దులను నీటితో శుభ్రం చేసి వాటి కొమ్ములకు రంగులు పూసి మెడలో గజ్జెలు, గంటలు కట్టి అందంగా అలంకరించారు. నైవేద్యాన్ని పెట్టి పూజించారు. సాయంత్రం ఎద్దులతో ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుళ్లను మొక్కుకున్నారు.


వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్న రైతు సంఘం నాయకులు

మద్దికెర: వ్యవసాయం కలిసి రాకున్నా నిరుత్సాహ పడకుండా వాన వచ్చిందంటే అదే ఉత్సాహంతో వ్యవసాయాన్ని ప్రారంభించడం అన్నదాతల గొప్పతనమని సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు అన్నారు. శనివారం ఏరువాక పున్నమిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఎం.అగ్రహారం పొలాల్లో వ్యవసాయ పనులను ప్రారంభించారు. వ్యవసాయంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని ఏటా పంటలు సాగు చేయడం అన్నదాతకు మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజాసాహెబ్, కోదండరాముడు, హనుమన్న, నాగిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలు చేయాల్సిందే

- పంచాయతీ సమావేశంలో వార్డు సభ్యుల డిమాండ్


పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నిస్తున్న వార్డు సభ్యులు,



సమస్యలపై కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

హొళగుంద: వారపు సంత మార్కెట్‌తో పాటు గతంలో వేలం దక్కించుకుని తరువాత డబ్బులు చెల్లించకుండా ఉన్న వారి నుంచి బకాయిలు వసూలు చేయాల్సిందేనని వార్డు సభ్యులు చిన్న మల్లయ్య, సుభాన్, హమీద్, ఖాదర్ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం హొళగుంద పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ వార్డు సభ్యులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలం పాట నిర్వహణ, పారిశుద్ధ్యం, ఇతర అభివృద్ధి అంశాలపై కార్యదర్శి మాట్లాడుతూ.. గతంలో వేలం దక్కించుకుని ఏళ్ల గడుస్తున్నా కొందరు బకాయిలు చెల్లించలేదని.. ఆ మొత్తం రూ.6.70 లక్షలు ఉన్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు కలగచేసుకుని అలాంటి వారికి నోటీసులు జారీ చేయాలని, స్పందించకపోతే లీగల్‌గా వెళ్లి బకాయిలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రైనేజీల శుభ్రత, పూడిక తొలగింపుతో పాటు బస్టాండ్ నుంచి కోటవీధికి వెళ్లే మార్గంలో అక్రమ కట్టడాలు తొలగించాలని, కొర్చెవంకలో పూడిక తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

చిప్పగిరి: బేల్దోణ సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు తమ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలని సహకార సంఘం కార్యదర్శి హరికృష్ణ అన్నారు. ఇందు కోసం రైతులు సంఘం పాసుపుస్తకం, ఆధార్ కార్డు, పాన్ కార్డు, పొలం పాసుపుస్తకం, ఫొటోలతో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెన్యూవల్ చేసుకోకుంటే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు అందవని పేర్కొన్నారు.

అధ్వానంగా రహదారి


అధ్వానంగా మారిన విరుపాపురం-బిలేహాల్ రోడ్డు

హాలహర్వి: మండలంలోని విరుపాపురం-బిలేహాల్ నుంచి మండల కేంద్రమైన హాలహర్వికి వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్డు నుంచి హాలహర్వికి 6 కి.మీ. రహదారి గులకరాళ్లు తేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పంతవెంకన్న ఆంజనేయస్వామికి పూజలు


పంతవెంకన్న ఆంజయనేయస్వామి

ఆలూరు: హత్తిబెళగళ్ గ్రామంలోని పంత వెంకన్న ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు కుంకుమార్చన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


బాపనదొడ్డిలో కళకళలాడుతున్న వేరుశనగ పంట

పచ్చందనమే.. పచ్చదనమే


కృష్ణగిరిలో సాగుచేసిన ఆముదం పంట

కృష్ణగిరి: మండలంలో ముందస్తుగా సాగుచేసిన ఖరీఫ్ పంటలు కళకళలాడుతున్నాయి. మే నెలలో సాగు చేసిన పంటలన్నీ పచ్చందాలతో రహదారుల్లో వెళ్లేవారికి ఆకట్టుకుంటున్నాయి. కోటి ఆశలతో సాగుచేసిన వేరుశనగ, ఆముదం, కంది పంటలు సకాలంలో సాగు చేసినా ఇక నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తేనే అన్నదాతకు భరోసా ఉండేది. పంటలు పచ్చగా వస్తుండడంతో పైరుకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంటుందని.. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

గోదాముల్లో సరుకుల వివరాలు సేకరించండి


వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీత

ఆలూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ గోదాముల్లో నిల్వ చేసిన సరుకుల వివరాలను సేకరించాలని యార్డు కార్యదర్శి కె.సునీత సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. చిప్పగిరి, హొళగుంద మండలాల్లో 12 గోదాములు ఉన్నాయని తెలిపారు. గోదాముల్లో సామర్థ్యానికి మించి సరుకులను నిల్వ చేయరాదన్నారు.

మెరుగైన సేవలందిస్తేనే ఉద్యోగులకు గుర్తింపు


డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డిపో మేనేజర్ అమర్నాథ్

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీ ఉద్యోగులు మెరుగైన సేవలందిస్తేనే తగిన గుర్తింపు ఉంటుందని ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ అన్నారు. మెరుగైన కేఎంపీఎల్ సాధించిన బస్సు డ్రైవర్లు ఎస్‌ఎస్ ఈరన్న, హెచ్.సుభాస్‌చంద్రమోహన్‌బాబులకు శనివారం డిపోలో నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. డిపో మెకానిక్‌లు కెకె.ప్రసాద్, శరభన్న, శ్రీనివాసులుతోపాటు వెల్డర్లకు ప్రశంసాపత్రాలను అందించారు. డిపో సూపరింటెండెంట్ పంపాపతి, అసిస్టెంట్ మేనేజర్ జీవి.నాగరాజు, నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి ముస్తక్ అహమ్మద్ పాల్గొన్నారు.


పెనుమాడలో ఉల్లినాట్లు వేస్తున్న కూలీలు

ఊపందుకున్న ఉల్లి నాట్లు

కృష్ణగిరి: మండలంలో ఉల్లినాట్లు ఊపందుకున్నాయి. జిల్లాలో అత్యధిక ఉల్లిసాగు చేసే మండలాల్లో కృష్ణగిరి మండలం ఒకటి. బోరు, బావులు ఉన్న ప్రతి రైతు ఉల్లి సాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఉల్లికి మంచి ధర ఉండడంతో ఈ ఏడాది రైతులు 500 ఎకరాలకుపైగా ఉల్లి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

భూసార పరీక్షలతో ఎన్నో ప్రయోజనాలు

మద్దికెర: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఏ పంటలు సాగు చేయొచ్చు, ఎరువులు ఎంత మోతాదులో వినియోగించవచ్చొ తెలుస్తుందని.. ఫలితంగా మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ రవి తెలిపారు. మండలంలో 1200 శ్యాంపిల్స్ సేకరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు వ్యవసాధికారులకు సహకరించి భూసార పరీక్షలు చేయించుకునేందుకు సహకరించాలని కోరారు. పరీక్షలు చేయించడం వల్ల పంటల సాగు, ఎలాంటి మందులు ఉపయోగించి పంటలు సాగు చేయాలన్న వాటిపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తామన్నారు.

వచ్చే నెల 12 వరకు 'నేను బడికి పోతా'

తుగ్గలి: బడి బయట పిల్లలను గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించే విధంగా 'నేను బడికి పోతా' ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని జూలై 12వ తేదీ వరకు కొనసాగించాలని ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. 6 ఏళ్ల నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు బడిలోనే ఉండాలని, డ్రాపౌట్ పిల్లలను మళ్లీ బడిలో చేర్పించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది సహాయంతో గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వేచేసి బడి బయట పిల్లలను గుర్తించాలన్నారు. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ఉపయోగాలు, పథకాలపై పిల్లలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.